ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 11.10.2025 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. వ్యవసాయాన్ని మరింత సుస్థిరం చేయాలనే లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు న్యూ ఢిల్లీ లో 'ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన' పథకాన్ని ప్రారంభించారు.
2. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం సుముఖంగా ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎందుకు స్పందించడం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రశ్నించారు.
3. ఈ రోజు అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటున్నారు.
4. రాష్ట్రంలో రాబోయే ఆరు రోజుల పాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

--------------------

**పీఎం-ధన్ ధాన్య కృషి యోజన**

వ్యవసాయాన్ని మరింత సుస్థిరం చేయాలనే లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు న్యూ ఢిల్లీ లో 'ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన' పథకాన్ని ప్రారంభించారు. దేశవ్యాప్తంగా వ్యవసాయపరంగా వెనుకబడిన 100 జిల్లాలను ఈ పథకం కోసం ఎంపిక చేయగా, రాష్ట్రంలో నారాయణపేట, జోగులాంబ గద్వాల, నాగర్ కర్నూల్, జనగామ జిల్లాలు ఈ జాబితాలో ఉన్నాయి. ఎంపికైన ప్రతి జిల్లాకు ఆరేళ్లలో ప్రతీ ఏటా 40 కోట్ల రూపాయలు మంజూరు కానున్నాయి. జనగామ కలెక్టరేట్‌లో కరీంనగర్ జిల్లాలోని జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం

(కేవీకే)తో పాటు రాజన్న సిరిసిల్ల జిల్లాలో వ్యవసాయ మార్కెట్ కమిటీలు, రైతు వేదికలలో అధికారులు, రైతులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా ఈ ప్రారంభోత్సవాన్ని వీక్షించారు.

**(పీటీసీ జనగామ, కరీంనగర్, సిరిసిల్ల)**

--------------------------

**హరీశ్ రావు**

రాష్ట్ర జల వనరుల ప్రయోజనాలను కాపాడడంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి టి. హరీశ్‌రావు విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టును పరిశీలిస్తున్నామని కేంద్రం లేఖ రాసినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎందుకు స్పందించడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 423 టీఎంసీల గోదావరి జలాలను అక్రమంగా మళ్లించుకుపోతున్నా తెలంగాణ ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపించారు. ఈ రోజు హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ గోదావరి జలాలను ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కృష్ణా జలాలను కర్ణాటక, మహారాష్ట్ర తరలిస్తామని ప్రకటిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నిస్సత్తువగా ఉందని విమర్శించారు..

**(డెస్క్)**

------------------------

**బాలికా దినోత్సవం**

ఈ రోజు అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని రాష్ట్ర వ్యాప్తంగా జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో ఆడపిల్లలకు సమానమైన హక్కులు కల్పించి, వారిని అన్ని విధాలుగా ప్రోత్సహించేందుకు కృషి చేస్తూ.. బాలికల బంగారు భవితకు బాసటగా నిలుద్దమని పేర్కొన్నారు

**(డెస్క్)**

--------------------------

**బాలిక దినోత్సవం- మహబూబాబాద్ CDPO**

నేటి సమాజంలో అన్ని రంగాల్లో పురుషుల కంటే మహిళలే ఉన్నత స్థానంలో ఉంటున్నారని మహబూబాబాద్ జిల్లా CDPO శిరీష అన్నారు. బాలికల హక్కుల సంరక్షణ, విద్య, ఆరోగ్యం, సామాజిక సమానత్వంపై అవగాహన కల్పించడమే అంతర్జాతీయ బాలికా దినోత్సవ ముఖ్య ఉద్దేశమని ఆకాశవాణితో చెప్పారు.

**( బైట్ : శిరీష.. సిడిపిఓ.. మహబూబాబాద్)**

**మహబూబాబాద్ జిల్లా, పి.టి.సి**

----------------------

**బాలికల దినోత్సవం సిరిసిల్ల**

సమాజంలో ప్రతి ఒక్కరూ బాలికలను బాలురతో సమానంగా గౌరవించి, వారి భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలని రాజన్న సిరిసిల్ల జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖాధికారి లక్ష్మీరాజం ఆకాశవాణితో చెప్పారు.

**(సౌండ్ బైట్ మహిళా శిశు సంక్షేమ శాఖాధికారి లక్ష్మీరాజం)**

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

------------------------

**ఆసిఫాబాద్-బాలికల దినోత్సవం**

అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల గురుకులంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జి యువరాజ్, బాలికలు ప్రభుత్వాలు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు.

(పీటీసీ, ఆసిఫాబాద్)

-----------------------------

**ఆరు జిల్లాల్లో పల్స్ పోలియో**

రాష్ట్రంలోని 6 జిల్లాల్లో రేపు పల్స్ పోలియో వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తారు. దేశవ్యాప్తంగా కేంద్ర ఆరోగ్యశాఖ గుర్తించిన 290 జిల్లాల్లో తెలంగాణ నుంచి హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, హన్మకొండ జిల్లాలతో పాటు, వరంగల్ జిల్లాలోని పట్టణ ప్రాంతంలోనూ ఈ డ్రైవ్‌ను నిర్వహించనున్నారు. ఈ 6 జిల్లాల పరిధిలో అప్పుడే పుట్టిన శిశువుల నుంచి 5 సంవత్సరాల వయసు గల 17 లక్షల 56 వేల 789 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

(డెస్క్)

---------------------

కిషన్ రెడ్డి- హాఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్ పునరుద్ధరణ

హైదరాబాద్ లోని హాఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్ పునరుద్ధరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ఇవి తుది దశకు చేరుకున్నాయని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'అమృత్ భారత్' పథకం కింద జరుగుతున్న ఈ పనులు పూర్తయితే, స్టేషన్‌లో ప్రపంచ స్థాయి సౌకర్యాలు అందుబాటులోకి వచ్చి, ప్రయాణీకుల అనుభవం మెరుగుపడుతుందని సామాజిక మాధ్యమం ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం 29.2 కోట్ల రూపాయలు కాగా, ఇప్పటివరకు 85 శాతం పనులు పూర్తయినట్లు మంత్రి తెలిపారు.

(డెస్క్)

-----------------------

**మహువా లడ్డూ-బండి సంజయ్**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆదిలాబాద్‌కు చెందిన మహువా లడ్డూల గురించి ప్రస్తావించడం ఆ ప్రాంత గిరిజన మహిళల జీవితాల్లో గొప్ప మార్పు తీసుకువచ్చిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. మన్ కీ బాత్‌లో ప్రస్తావించిన తర్వాత మహువా లడ్డూల అమ్మకాలు భారీగా పెరిగాయని సామాజిక మాధ్యమం ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. గతంలో రోజుకు 7 కేజీలు ఉన్న లడ్డూల అమ్మకాలు ఇప్పుడు రోజుకు 60 కేజీలకు పెరిగాయని, తద్వారా నెలకు దాదాపు 2 వేల కేజీలు అమ్ముడవుతున్నాయని వివరించారు.

**(డెస్క్)**

---------------------------

పీఎం ధన్ ధాన్య కృషి- జగిత్యాల

రైతుల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా పప్పుధాన్యాల ఉత్పత్తిని గణనీయంగా పెంచడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'పీఎం ధన్ ధాన్య కృషి యోజన' పథకాన్ని జగిత్యాల జిల్లాలో విజయవంతంగా అమలు చేయడానికి కృషి చేస్తున్నట్టు పెగడపల్లి మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్ ఆకాశవాణితో తెలిపారు.

**(బైట్ పెగడపల్లి మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్)**

పీటీసీ - జగిత్యాల

-----------------------

హైకోర్టు సీజే-యాదగిరి గుట్ట

రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి  అపరేశ్ కుమార్ ఈ ఉదయం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి వేదాశీర్వచనం చేశారు.

**(పీటీసీ, యాదాద్రి భువనగిరి)**

-------------------------

**వాతావరణం**

రాష్ట్రంలో రాబోయే ఆరు రోజుల పాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని  హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది.

**(డెస్క్)**

-------------------------

ఆసిఫాబాద్ గోలేటి మైన్స్ లో జిఎం పర్యటన

ఆసిఫాబాద్ జిల్లాలోని రెబ్బెన మండలం గోలేటి బొగ్గు గనుల్లో సింగరేణి బొగ్గు నిర్వహణ ప్లాంట్ జనరల్ మేనేజర్ రామ్మూర్తి ఈ ఉదయం పర్యటించారు. అధికారులకు బొగ్గు రవాణా నాణ్యత విషయంలో సూచనలు, సలహాలు చేశారు. బొగ్గు ఉత్పత్తి ప్రాంతాల్లో పర్యటిస్తూ ఉత్పాదకతను అడిగి తెలుసుకుంటున్నారు.

**(ఆసిఫాబాద్ జిల్లా పిటిసి)**

----------------------

**ఆసిఫాబాద్-సైన్స్ డ్రామా**

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీలు విజయవంతమయ్యాయి. మానవజాతి ప్రయోజనం కోసం శాస్త్ర సాంకేతికత అనే అంశంపై విద్యార్థులు ప్రదర్శన చేయగా జనకాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రదర్శన రాష్ట్రస్థాయికి ఎంపికైంది. విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేసిన జిల్లా సైన్స్ అధికారి కటకం మధుకర్, విద్యార్థులు చదువుతో పాటు శాస్త్ర సాంకేతిక రంగాలపై అవగాహన పెంచుకోవాల్సిని చెప్పారు.

**(పీటీసీ, ఆసిఫాబాద్)**

-------------------------

**సమాచర చట్టం-నల్లగొండ**

పారదర్శక పాలనకు సమాచార హక్కు చట్టం పాశుపతాస్త్రం లాంటిదని నల్గొండ జిల్లా రెవిన్యూ అధికారి వై.అశోక్ రెడ్డి అన్నారు. జిల్లాలో జరుగుతున్న సమాచార హక్కు చట్టం వారోత్సవాలలో పాల్గొని మాట్లాడుతూ, అధికార యంత్రాంగాలలో బాధ్యతను, పారదర్శకతను పెంచడానికి సమాచార హక్కు చట్టం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు.

**(పీటీసీ, నల్లగొండ)**

----------------------------

**నల్లగొండ-కలెక్టర్ తనిఖీ**

ప్రభుత్వం సూచించిన నాణ్యత ప్రమాణాల తో కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చి పూర్తి మద్దతు ధరను పొందాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి రైతులకు సూచించారు. ఈ ఉదయం నకిరేకల్ మండలం తాటికల్, అర్జాలబావిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు.

**(పీటీసీ, నల్లగొండ)**

--------------------

వేములవాడ-లడ్డూ

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో లడ్డూలకు బూజు పట్టిన ఘటనపై సమగ్ర వివరాలు అందజేయాలని ఆలయ అధికారులను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. ఈ అంశంపై ఇప్పటికే ఫుడ్ సేఫ్టీ అధికారులకు లేఖ రాసినట్లు ఆలయ ఈఓ రమాదేవి తెలిపారు.

**(పి టి సి, రాజన్న సిరిసిల్ల జిల్లా)**

---------------------------

**పత్తి కొనుగోళ్ళ- సీసీఐ అధికారుల సూచనలు**

పత్తి కొనుగోలు కేంద్రాలలో రైతులు తమ పంట ఉత్పత్తిని విక్రయించాలంటే తప్పనిసరిగా పాస్ కిసాన్ యాప్ లో నమోదు చేసుకోవాలని వరంగల్ ఎనుమాముల మార్కెట్ సీసీఐ అధికారులు సూచించారు. పత్తిని విక్రయించేందుకు రైతులు తప్పనిసరిగా స్లాట్ బుక్ చేసుకుని కొనుగోలు కేంద్రాలకు రావాలని తెలిపారు.

**(వరంగల్ జిల్లా పి టి సి)**

-----------------------

**భువనగిరి కోర్టు**

యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరిలో నూతన కోర్టు భవన నిర్మాణానికి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ శంకుస్థాపన, భూమిపూజా కార్యక్రమాలు ఈ రోజు నిర్వహించారు.

**(పీ టీ సీ యాదాద్రి భువనగిరి )**

---------------------------